క్లుప్తంగా

కొత్తూరులో జేసీ పూజలు



పూజలు చేస్తున్న జేసీ విష్ణు చరణ్

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో నంద్యాల జిల్లా జేసీ విష్ణు చరణ్ పూజలు చేశారు. గురువారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న ఆయన స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనకు శేషవస్త్రాలను అందించి సన్మానం చేశారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, అర్చకులు ఉన్నారు.

గణితం పరీక్షకు 59 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండల కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి గణితం సప్లిమెంటరీ పరీక్షకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల అధికారులు తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో నాల్గవ రోజు గణితం పరీక్షకు 184 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 154 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ అధికారి ధనుంజయ గౌడ్ తెలిపారు. అదేవిధంగా సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 195 మంది విద్యార్థులు గణిత పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 166 మంది విద్యార్థులు హాజరవగా, 29 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి వెంకటరమణ తెలిపారు.

యోగాంధ్రపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులందరూ ప్రతి పంచాయతీలో యోగాసనాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



ఉలిందకొండ వసతి గృహంలో దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

కల్లూరు: జిల్లా మలేరియా అధికారుల ఆదేశాల మేరకు సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణమోహన్ గురువారం ఉలిందకొండలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో అల్ఫా సైఫా మెతిరియన్ 5 శాతం మందును పిచిచారి చేయించారు. ఈ మందు పిచికారీ చేయడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మెదడువాపు, బోధకాలు కలుగచేసే దోమలను నివారించవచ్చని అధికారులు వివరించారు. ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ నాగరాజు, ఏఎన్ఎం పద్మావతి, ఆశా కార్యకర్తలు, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

దేశం గర్వించే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్): విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా నుంచి పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ప్రతిభ కరబరిచిన 135 మంది కురువ విద్యార్థులకు గురువారం కర్నూలు మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎంకే రంగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, కల్లూరు తహసీల్దారు ఆంజనేయులు, శ్రీనివాసులు, గుడిసె శివన్న చేతుల మీదుగా వారికి జ్ఞాపిక, సర్టిఫికెట్, నగదు బహుమతులు అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ.. కురువ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భానుశంకర్, కర్నూలు జిల్లా కురువ సంఘం ఉపాధ్యక్షుడు ధనుంజయ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

- ఘనంగా హనుమాన్ జయంతి
- కోడుమూరులో వైభవంగా శోభాయాత్ర



కోడుమూరులో హనుమాన్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న మహేశ్వరరెడ్డి



గూడూరులో ఆంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కోడుమూరులో హనుమాన్ శోభాయాత్ర

కోడుమూరు రూరల్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని గురువారం మండలంలోని ఆంజనేయ స్వామి దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కోడుమూరులోని చిన్నబోయవీధి, కోటవీధి, ఇరిగేషన్ కార్యాలయం ఆవరణం, కొండపేట, బీసీ కాలనీల్లో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించి భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే కోడుమూరులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర, బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. అంతకుముందు హనుమాన్ శోభాయాత్రను భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విశ్వహిందూపరిషత్ నాయకులు నాగేశ్వరరావు, కిరణ్, ప్రతాప్‌రెడ్డి, నటరాజ్, మురళీ, తాయప్ప, విటల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

➡ గూడూరు మండలంలో ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించడంతో పాటు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర కనులపండువగా నిర్వహించారు. అలాగే చనుగొండ్లలో స్వామి వారి పల్లకీ సేవ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ సేవా సమితి సభ్యులు జంగం మల్లికార్జున, సన్నప్ప, క్రిష్ణ, రమేష్, ఆచారి, భజరంగ్‌దళ్, వాల్మీకి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఆంజనేయ స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు తాకిడి పెరిగింది. ఉదయాన్నే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు ఆకుపూజ తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు పానకం పంపిణీ చేశారు.

➡ పాణ్యంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈఓ సువర్ణ ఆధ్వర్యంలో విశిష్ట పూజలు చేసిన అర్చకులు స్వామి వారిని పూల మాల, పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

➡ తమ్మరాజుపల్లె - సిమెంట్‌నగర్ మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నిర్వాహకులు స్వామి వారిని తమల పాకులు, వడమాలతో అలంకరించారు. భజన పోటీలు నిర్వహించారు. హనుమాన్ నామ స్మరణ మార్మోగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వేలాదిగా వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

➡ పాణ్యంలోని ఎస్సార్బీసీ కాల్వ సమీపంలో తాటికాయ ఆంజినేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి.

➡ తొగర్చేడు గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హనుమాన్ గీతాలు పాడి పూజలు నిర్వహించారు.

వైభవంగా గిడ్డాంజనేయస్వామి రథోత్సవం



గిడ్డాంజనేస్వామి కలశాన్ని రథం వద్దకు తీసుకెళుతున్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం వెంకటగిరిలో వెలసిన గిడ్డాంజనేయస్వామి రథోత్సవాన్ని గ్రామస్తులు గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్దన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోట్ల హర్షవర్దన్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని, కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి రథంపై ఆశీనులను చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు మహిళలు, గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటశివుడు, తిమ్మారెడ్డి, గిరిబాబు, పాలగిరి, మద్దిలేటి, వెంకటేశ్వరరెడ్డి, చంద్ర, మాదులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాణ్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు



తమ్మరాజుపల్లె ఆంజనేయస్వామికి ఆకుపూజ చేసిన దృశ్యం



తొగర్చేడు అభయాంజనేయస్వామికి భక్తుల పూజలు

సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు అరెస్ట్



మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐతో చర్చలు జరుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు: 'రూ.10 వేలకు గుమస్తాగా చేరిన ఒకరు కోట్లకు పడగలెత్తి నేడు కర్నూలు నగరాన్ని కాలుష్య కోరల్లో కూరుకునే విధంగా చేస్తున్నాడంటూ' సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు కర్నూలు మోటార్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ కార్యదర్శి వెంకటేశ్వర్లును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. గురువారం సాయంత్రం ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, నగర కార్యదర్శి రాముడు, రాజశేఖర్ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది కార్యకర్తలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో సీఐలు శేషయ్య, రామయ్య నాయుడు తదితరులు వారిని స్టేషన్‌లోకి పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా కొద్దిసేపు అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వెంకటేశ్వర్లుకు 41ఏ కింద నోటీసు ఇచ్చి విడుదల చేసి పంపడంతో సీపీఎం కార్యకర్తలు ఆందోళన విరమించారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

- పీఆర్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు వీ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన జెడ్పీ ప్రాంగణం విశ్వేశ్వరయ్య భవన్‌లోని తన చాంబర్‌లో కార్యాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి జూన్ 21వ తేది వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఇందులో అన్ని ప్రభుత్వ శాఖలు పాల్గొనేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలోనే తమ శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ప్రతి రోజు అందరు యోగాలో పాల్గొని ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లు, మినిస్టీరియల్ సిబ్బంది అందరు యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో డీఈఈ బండారు శ్రీనివాసులు, ఏఈలు పార్థసారథి, విజయ భాస్కర్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి



కంబదహాల్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ సుమంత్

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో గృహ నిర్మాణ లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ సుమంత్ సూచించారు. ఆయన గురువారం మండల హౌసింగ్ సిబ్బందితో కలిసి కంబదహాల్ గ్రామంలో పర్యటించారు. హౌసింగ్ కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. గృహ నిర్మాణాలు చేపట్టకపోతే ఇంటి పట్టాను రద్దు చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు నోటీసులు అందజేశారు. మండలంలో 189 మంది గృహ లబ్ధిదారులు ఉండగా 136 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. 53 ఇళ్ల నిర్మాణ దశలలో ఉండగా, 20 మంది లబ్ధిదారులకు అదనపు నగదులో భాగంగా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరైనట్లు ఏఈ వివరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాధురి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, లబ్ధిదారులు ఉన్నారు.



బస్తిపాడు సమీపంలో దెబ్బతిన్న బ్రిడ్జి

ఆదమరిస్తే అంతే!

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామ సమీపంలో వాగు వద్ద రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. తారు రోడ్డు అంచున మట్టి కోతకు గురై కల్వర్టు కూలిపోయింది. ఈ రోడ్డుపై బొల్లవరం, పుసులూరు, రెమడూరు, అనుగొండ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. బస్తిపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు, రైతులు ప్రయాణిస్తుంటారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో కొందరు వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారన్న సమాచారంతో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముగ్గురు అనుమానిత వ్యక్తుల ఇళ్లలో విజిలెన్స్ అధికారులు విశ్వనాథ్, భూపతి మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్‌తో కలిసి తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాల అమ్మకాలపై ఆరాతీశారు. అయితే తనిఖీల్లో ఎలాంటి విత్తనాలు పట్టుబడలేదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ రవిప్రకాష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా లూజు పత్తి విత్తనాలు అమ్ముతుంటే అలాంటి వారి సమాచారాన్ని తమకిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, కోనుగోలు సమయంలో దుకాణదారుడి నుంచి తప్పనిసరిగా రసీదు పొందాలని ఏఓ సూచించారు.

సీఆర్‌సీలో క్రీడాకారుల నమోదు తప్పనిసరి

కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, నిర్వహించనున్న అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పనిసరిగా సీఆర్ఎస్ (సెంట్రల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఫుట్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లేని ఎడల ఎంపిక పోటీలకు అనర్హులవుతారని పేర్కొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, 18 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు 10వ తరగతి సర్టిఫికెట్, లేదా డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు, ఏఐఎఫ్ఎఫ్ (ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్) ఫీజు రూ.300 రిజిస్ట్రేషన్ రుసుంతో 98662 11480 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఫుట్‌బాల్ క్రీడాకారుడు వచ్చే నెల 15వ తేదీలోపు ఈ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

'కాశన్నను బదిలీ చేయాల్సిందే'

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న విషయంలో ఆ అసోసియేషన్‌లో వివాదం ముదురుతోంది. కర్నూలు ఏడీఏ కార్యాలయంలో కాశన్న జూనియర్ అసిస్టెంట్‌గా తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నందున బదిలీ చేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్ తదితరులు జిల్లా వ్యవసాయ అధికారిని కలసి కోరారు. ఆఫీస్ బేరర్‌గా తొమ్మిదేళ్లు పూర్తి కానందున అక్కడే కొనసాగించాలని జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిని కలిసి కోరారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్‌లోనే బదిలీల విషయంలో వివాదం నెలకొంది. కాగా పూర్తి ఆధారాలు సమర్పించాలని డీఏఓ వరలక్ష్మి అసోసియేషన్ నేతలను కోరారు. వివరాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

యోగా శిక్షణ

కర్నూలు (అర్బన్): యోగాంధ్ర ప్రచారంలో భాగంగా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీరాజ్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టర్ ట్రైనర్ కళ్యాణ్ పర్యవేక్షణలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు మద్దన్న, ఈఈ రవీంద్రారెడ్డి, డీఈఈలు ఈరన్న, రమేష్ కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసులు, మద్దిలేటి, ఏఈఈలు అమర్‌నాథ్, సతీష్ కుమార్, ముక్తార్ బాష, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగనుంది.

కార్యసాధకుడికి హనుమంతుడే ఆదర్శం



ఓర్వకల్లులో ప్రసంగిస్తున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

ఓర్వకల్లు: కార్యసాధకుడికి హనుమంతుడే ఆదర్శమని ధార్మిక ప్రవచకులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని అన్నారు. గురువారం మండలంలోని కాల్వ, కొమ్ముచెరువు, బొడ్డువానిపల్లె, ఓర్వకల్లు, లొద్దిపల్లె తదితర గ్రామాలలో వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానాలలో హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ఆలయాల పురోహితులు స్వాముల వారికి సిద్ధోదక స్నానం, అభిషేకం, సింధూరపు అలంకరణ, కలశస్థాపన, ఆకుపూజ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు సామూహిక అన్నదాన కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం స్వాముల వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఓర్వకల్లు ఆంజనేయస్వామి గుడి వద్ద జరిగిన వేడుకల్లో డాక్టర్ చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై ధార్మిక ప్రవచనం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధార్మిక సభా కార్యక్రమంలో హనుమంతుని గుణ పరాక్రమాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. యువత సరైన మార్గంలో నడవాలంటే బాల్యం నుంచే ధార్మిక చింతన అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాంభూపాల్‌రెడ్డి, పవన్‌కుమార్, లింగం కృష్ణయ్య, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



పాణ్యం నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ జెండాలతో సంఘీభావం తెలుపుతున్న స్థానికులు

పాణ్యం: భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై చేపట్టిన దాడులు (ఆపరేషన్ సిందూర్)కు మద్దతుగా పాణ్యంలోని ప్రజలు జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం పాణ్యం బస్టాండ్ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమర జవానులకు సంతాపం తెలిపారు. అలాగే దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ప్రతాప్, సీతక్క, నాగ సందీప్, చిరంజీవి, క్రిష్ణారెడ్డి, శకుంతల, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్ జామ్



44వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు

కర్నూలు(రూరల్): నగర శివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెన్నై - సూరత్ హైవే పనుల్లో భాగంగా దిన్నెదెవరపాడు గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న సొరంగం మార్గం పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే ఈ నెల 8న రింగ్ రోడ్డు సమీపంలో ఎన్‌హెచ్ - 44పై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కృతుంగ హోటల్ వరకు వన్ వే లో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో రహదారిపై వాహనాల పంక్చర్లు, మరమ్మతులకు గురైనప్పుడు భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. నిత్యం ట్రాఫిక్ అవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం హైవే మొబైల్ -1, పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

పెద్దపాడు వక్కెర వాగుపై దెబ్బతిన్న రక్షణ గోడ



వాహనదారులూ జాగ్రత్త

కల్లూరు: కర్నూలు నుంచి కోడుమూరు వెళ్లే రోడ్డు పెద్దపాడు సమీపంలోని వక్కెర వాగు బ్రిడ్జి రక్షణ గోడ దెబ్బతినింది. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు కర్నూలు నుంచి కోడుమూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, బళ్లారి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటా యి. కోడుమూరు నుంచి కర్నూలు వైపు వచ్చే వాహనాలు ఏ మాత్రం అదుపుతప్పినా వాహనం వాగులోకి వెళ్లాల్సిందే. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి వక్కెర వాగుపై రక్షణ గోడకు మరమ్మతులుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.